## "అబ్బా!... అమ్మా..."

లేబర్ రూంలో ఆపసోపాలు పడుతోంది లక్షాధికారి లక్ష్మీపతిరావు పెద్దకోడలు లకుమాదేవి ఆ అర్థరాత్రి పన్నెండు గంటలవేళ.

లక్ష్మీపతిరావు వంటి సంపన్నులయింటి కోడళ్ళకోసం, ఆడపడుచుల కోసం ఆ నర్సింగ్‌హోమ్ తలుపులు ఎప్పుడూ తెరిచేవుంటాయి.

పేషంటుని పరీక్ష చేయటానికి మేడ మెట్లు దిగివచ్చిన డాక్టరు పరిమళాదేవికి ఎదురువచ్చింది లక్ష్మీపతిరావు భార్య లలితాదేవి.

"నమస్కారం డాక్టరుగారూ! మా కోడలు లకుమ! గతసంవత్సరం పెళ్ళయింది. మీకు తెలుసు కదూ! తొమ్మిదోమాసం వచ్చిందనే పురిటికి పుట్టింటికి వెడుతూ ఇక్కడగ నాలుగురోజులు వుండి వెళ్ళవచ్చుని నిన్ననే వచ్చింది. అనుకోకుండా నెప్పి వస్తోందంటే, ఇక మిమ్మల్ని యిబ్బందిపెట్టక తప్పలేదు." నొచ్చుకుంది లలితాదేవి.

"పరవాలేదు లలితాదేవిగారూ! ఇలాంటి ఇబ్బందులకోసమే మేముఎదురు చూస్తూ వుంటాం. ఒక్క నిముషం కూర్చోండి. అమ్మాయిని పరీక్షచేసి వస్తాను" లేబరు రూంలోకి నడిచింది పరిమళాదేవి.

"ఏదమ్మా! సరిగా పడుకో. పరీక్ష చేస్తాను. మరేం భయంలేదు." అంటూ బొడ్డు క్రిందుగా నిలువుగా వున్న నాలుగైదు అంగుళాల ఆపరేషన్ స్కార్ చూస్తూనే కనుబొమలు ముడిచింది పరిమళాదేవి.

"ఇదివరలో ఏం ఆపరేషన్ చేయించుకున్నావమ్మా?" డాక్టరు ప్రశ్నకు లకుమ సమాధానం చెప్పకుండానే బాధతో మెలికలు తిరిగిపోతోంది.

ఇంకేమీ ప్రశ్నించకుండా లకుమను పరీక్షచేసి బైటకు వచ్చింది పరిమళ.

"అంతా నార్మల్‌గానే వుంది లలితాదేవిగారూ! కంగారు పడవలసిందేమీ లేదు. తెల్లవారేసరికి డెలివరీ కావచ్చు." డాక్టరు మాటలకు లలితాదేవి గుండెలు కుదుటపడ్డాయి.

"అయినా ఏడోమాసంలోనే పురిటికి పంపించమని బతిమాలారు వాళ్ళు. కానీ మావాడు వినిపించుకోలేదు." విసుగ్గా చూసింది ప్రక్కకుర్చీలో కూర్చున్న కొడుకు సుకుమార్‌ని.

"ఆఁ ఇంతకూ ఆ అమ్మాయికి ఇదివరలో ఏం ఆపరేషన్ అయిందో, ఎంత కాలం క్రితం అయిందో మీకేమయినా వివరాలు తెలుసా?"

"రెండేళ్ళ క్రితం అపెండిసెక్టమీ ఆపరేషన్ జరిగిందట. వచ్చిన ఇంత సేపటికి నోరు విప్పాడు సుకుమార్.

"అపెండిసెక్టమీయా!" తేలిగ్గా అంది పరిమళ. "మరేమీ కంగారు పడకండి. తెల్లవారేసరికి మీకు పండంటి మనుమడిని అందించే పూచీనాది. నర్సు దగ్గరే వుంటుంది. ఏమైనా అవసరమైతే కబురుచేయండి." నర్సుకి అవసరమైన సూచనలిచ్చి సెలవుతీసుకుంది పరిమళ.

ఫోన్ మ్రోగుతోంది.

నిద్రమత్తులో బద్ధకంగా రిసీవరు అందుకుంది పరిమళ. అవతల డ్యూటీ నర్సు గొంతు కంగారుగా వినిపిస్తోంది.

# అవినీతీ నీ విలువెంత?



అల్లూరి రాజకుమారి

తన నాటకం ప్రదర్శించే రోజున బెర్నార్డ్‌షా చర్చిల్‌కి రెండు టిక్కెట్లు పంపించాడు. ఆ టిక్కెట్లతో పాటు ఓ చిన్న ఉత్తరం కూడా రాశాడు.

"నా నాటకం తిలకించేందుకుగాను మీకు రెండు టిక్కెట్లు పంపుతున్నాను. ఒకటి మీకూ, రెండోది మీ స్నేహితుడుకీ – మీకు స్నేహితుడంటూ ఒకడుంటే..."

చర్చిల్ వెంటనే జవాబు రాసి పంపించాడు:

"మీ నాటకానికి మొదటి రోజు రావడం సాధ్యంకాదు రెండో రోజు వస్తాను – రెండోరోజు అది ప్రదర్శింపబడేట్లయితే..."

---

"లకుమాదేవి కండిషన్ సీరియస్‌గా వుంది. ఒక్కసారి అర్జంటుగారండి"

పరిమళ నిద్రమత్తు ఒక్కసారిగా వదిలిపోయింది. గబగబా క్రిందకుదిగింది ఆ తెల్లవారుఝామున నాలుగు గంటల వేళ.

నర్స్ లూసీ కంగారు పడుతోంది.

"ఫీటల్ హెడ్ కనిపిస్తూంటే టేబుల్ మీదకు మార్చాను. పేషంటు రెస్ట్‌లెస్‌గా వుందని బి. పి. చూస్తే ఫాల్అయివుంది.

నిజమే పేషంటు షాక్‌లోనే వుంది. తల్లి గర్భంలోని బిడ్డ బైట ప్రపంచాన్ని చూడడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. కొనవూపిరితో కొట్టుకుంటోంది. ఏం జరిగింది? అంతా నార్మల్ కండిషన్‌లో వుండగా పేషంటు షాక్‌లోకి వెళ్ళడానికి కారణమేమిటి? యూటిరైన్ రప్చరా? కానీ అన్ని కండిషన్సు ఫేవరబుల్‌గా వుండగా మొదటికాన్పులో యూటిరస్‌రప్చర్ కావడానికి కారణమేమై వుంటుంది?

గబగబా సెలైన్ స్టార్ట్‌చేసి రోగి బంధువులకు రెండు బ్లడ్ బాటిల్స్ తెచ్చుకోమని శాంపిల్స్ పంపించి, అర్జంటుగా రమ్మని ఇంకొక సీనియర్ డాక్టర్ శ్యామలాదేవికి ఫోను చేసింది పరిమళ.

లకుమాదేవి తల్లిదండ్రులు కూడా ఫోను అందుకుని అప్పటికప్పుడే వచ్చేశారు,

లకుమ తల్లి వెక్కి వెక్కి ఏడుస్తోంది. తండ్రి దిగాలుపడి కూర్చుండిపోయాడు.


శ్యామలాదేవి రావడమే హడావుడి ప్రారంభమైంది.

"యూటిరస్ రప్చర్ అయిన విషయం తెలుస్తూనే వుందిగా! వెంటనే లేపరాటమీకి రెడీచెయ్యండి."

"కానీ మొదటి కాన్పులోనే ఇంత నార్మల్ కేసుకి యూటిరస్ రప్చర్ కావటం...." ఇంకా సందేహం వదలలేదు పరిమళాదేవికి.

"ఇదే మొదటికాన్పు అని నమ్మకమేమిటి? ముందు థియేటర్ రెడీచెయ్యి" గైనకాలజిస్టు శ్యామలాదేవి మాటలకు తెల్లబోయింది పరిమళ.

"రెండేళ్ళక్రితం అపెండిసెక్టమీ జరిగిందట" మెల్లిగా నసిగిన పరిమళ




మాటలను వినిపించుకోలేదు శ్యామలాదేవి

ఆపరేషను ప్రారంభమైంది.

"ఇదేనా నువ్వు చెప్పిన అపెండి సెక్టమీ?" ఎదురుగా, నార్మల్‌గా కనిపిస్తున్న ఎపెండిన్స్‌ని చూపిస్తున్న శ్యామలాదేవిని పిచ్చిచూపులు చూసింది పరిమళ.

"ఎందుకంత ఆశ్చర్యం? పేషంటు చెప్పింది నమ్మి వేయడమేనా? ముందే కండిషన్ వూహించివుంటే. పేషంటుని నిలదీసి అడిగివుంటే "సీజర్" చేసి తల్లీ బిడ్డలను రక్షించివుండే వాళ్ళం." మందలించింది శ్యామలాదేవి.

ఇంకా నమ్మబుద్ధి కావటం లేదు పరిమళకు.

పెళ్ళి కాకుండానే గర్భవతి అయి ఎక్కువ నెలలు గడిచేవరకూ రహస్యాన్ని దాచి ఇక, దాటలేని స్థితివచ్చిన తరువాత హిస్టరాటమీ చేయించుకుందన్నమాట. దానివల్ల తరువాత ప్రసవం ప్రమాదకరం కావచ్చునని ఆ చేసిన డాక్టరైనా చెప్పలేదా? చెప్పినా ఇక్కడ హఠాత్తుగా నెప్పులుప్రారంభం కావటంతో ఈ కఠిన సత్యాన్ని ఎలా చెప్పాలో తెలియక మౌనం వహించి వుండవచ్చు. చేతులారా నిండు ప్రాణానికి ముప్పు తెచ్చుకుంది.

అయినా ఎంత దారుణం? పెళ్ళికాకుండానే గర్భవతి అయి, ఆ పాపాన్ని రహస్యంగా కడిగివేసుకుని, ఏ పాపమూ తెలియని సుకుమార్ జీవితంలోకి అడుగు పెట్టిందా? ఎంత మోసం? ఒకసారి ఒకరి వల్ల మోసపోయిన తను మరొకరిని మోసగించకుండా నిజాయితీగా చెప్పుకోలేక పోయిందా? కనీసం ఒంటరిగా బ్రతికే ధైర్యమైనా లేకపోయిందా?

"ఆలోచనలో పడిపోయావ్ పరిమళా! ముందు ఇటు చూడు" నిర్జీవ శిశువును తీస్తూ హెచ్చరించింది శ్యామలాదేవి.

"మేడం బి. పి. ఇంకా ఫాల్ అవుతోంది" లూసీమాటలకు ఈ లోకంలోకి వచ్చిన పరిమళాదేవిలో ఆరాటం పెరిగిపోతోంది. కనీసం తల్లినైనా బ్రతికించగలరా తాము? నిట్టూర్చింది.

"అవినీతీ! నీ వెలఎంత?"

"ఒక నిండు జీవితమా?"

●